ప్రజాశక్తి

ఆదివారం 21 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







వేమూరులో భారీవర్షానికి నీటమునిగిన వరి పంట

దంచి కొడుతున్న వాన

వెద పద్ధతిలో వరిసాగు చేసిన రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. గడిచిన మూడు రోజులుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలో శుక్రవారం 264.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా శనివారం 224.8 మిల్లిమీటర్లు నమోదైంది. జిల్లాలో వెద పద్ధతిలో వరి సాగు చేసిన వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలుల్లో అత్యధికంగా వర్షం పడింది. దీంతో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేపట్టిన రైతులు ఈ వర్షాల కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌ను రైతులు నష్టాలతో ప్రారంభించినట్లయింది. ఇటీవలి కాలం వరకు సక్రమంగా వర్షాలు లేక, కాలువలకు నీరు రాక రైతులు వరినార్లు పోయడం కాకుండా వెద పద్ధతిలో వరిసాగు చేపట్టారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సాగు చేసిన వరిపొలాల్లో వర్షపు నీరు చేరాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు ముందు వెద పెట్టిన వరిపొలాలు కూడా నీటితో నిండిపోయి ఉండటంతో గింజలు దెబ్బతిని కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువకు ▶ 2లో

నకిలీ పత్రాలతో మోసం.?

- రూ.కోట్ల విలువైన భూమిని కాజేసే యత్నం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- ఆ భూమిని కొన్నవారికీ తప్పని వేధింపులు



నకిలీ పత్రాలతో కాజేయాలనుకుంటున్న భూమి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు నగరంలో గత ప్రభుత్వంలో మొదలైన నకిలీ పత్రాలతో భూములను కాజేసే వ్యవహారాలకు ఇప్పటికీ అడ్డుకట్ట పడలేదు. యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.బాధితులు పోలీసులను ఆశ్రయిస్తూనే ఉన్నారు.దీనిపై సిట్ ఏర్పాటు చేసినా ఎన్నికల రావడంతో దాని విచారణలు, నివేదికలు మరుగునపడ్డాయి. ఇప్పుడూ వీటిపై సిట్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని పాలకపక్ష నేతలు చెబుతున్నారు.అయితే నకిలీపత్రాలతో భూములను కాజేసేందుకు యత్నాలు నడుస్తున్నాయి. ఈ పత్రాలతో కోర్టుల్లో కేసులు వేయడంతో అవి వివాదాలుగా మారిపోతున్నాయి. కోర్టుల్లో విసిగివేసారిపోతారనే భావనతో కబ్జాదారులు రాజీలకు పిలవడం, మధ్యవర్తులతో పంచాయితీలు పెట్టించి ఎంతోకొంత కాజేయడం వంటి వ్యవహారాలు నడుస్తూనే ఉన్నాయి.

ఒంగోలు తాలూకా స్టేషన్ పరిధిలోని ఓ కేసుకు సంబంధించిన బాధితులు తమకు జరిగిన అన్యాయంపై 'ప్రజాశక్తి'కి వివరించారు. ఈ కేసుల వ్యవహారంపై తాలూకా స్టేషన్‌లోనూ ఫోర్జరీ పత్రాలతో భూమికి ఎసరు పెట్టిన ఓ కార్పొరేటర్‌పై కేసు కూడా నమోదు చేశారు. బాధితురాలు కాకుమాను రంగనాయకమ్మకు ఎస్పీ కార్యాలయం ఎదురుగా సర్వే నెంబరు 188బై3లో 93 గదుల స్థలం ఉంది. ఈ రోడ్డులో పలు వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రుల కోసం కొత్తకొత్త భవనాలూ కడుతున్నారు. ఇక్కడ గది ఐదు లక్షలకు పైగానే ధర పలుకుతోంది. అంటే దీని విలువ రూ.5 కోట్ల వరకూ ఉంది. దీన్ని కాజేసేందుకు ఓ కార్పొరేటర్ నకిలీపత్రాలతో అగ్రిమెంటు సృష్టించారు. దాన్ని కోర్టులో వేయడంతో వివాదంగా మారింది. విచారణ కొనసాగుతోంది.

నకిలీ పత్రం ఎలా తెచ్చారంటే..

ఈ ప్లాటు యజమాని కాకుమాను రంగనాయకమ్మకు రూ.75 లక్షలు ఇచ్చినట్లు అగ్రిమెంటు పత్రం ఒకటి తయారైంది. ఇది రూ.20 స్టాంపుపై రాశారు. అయితే ఈ డాక్యుమెంటుపై యజమాని రంగనాయకమ్మ ఫోర్జరీ సంతకాలు చేశారు. డబ్బులు తీసుకొని భూమి అమ్మేందుకు అంగీకారంగా ఈ పత్రం తయారైంది. గతేడాది సెప్టెంబరులో అగ్రిమెంటు రాసినట్లు తయారు చేశారు. వాస్తవానికి తనకు వాళ్లెవరో కూడా తెలియదని బాధితురాలు చెబుతున్నారు. అగ్రిమెంటు కోసం ఫేక్ పత్రాలను వాడారని గుర్తించారు. కనిగిరికి చెందిన స్టాంప్ వెండర్ పీవీ.ప్రభాకర్ పేరుతో స్టాంపు పేపరు తెచ్చారు. వాస్తవానికి ఇతను 2021 డిసెంబరులోనే గుంటూరు గవర్నమెంటు ఆసుపత్రిలో అనారోగ్య సమస్యతో చనిపోయి నట్లు గుర్తించారు. అలాంటప్పుడు ▶ 2లో

ప్రభుత్వ వైద్యశాలల్లో

మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ వెంకట మురళి
- బాపట్ల ఏరియా వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగుల పేర్ల నమోదు, ఓపి, ఇంజక్షన్ వేసే గది, హెచ్ఐవి కౌన్సిల్ గదులు, ఎక్స్ రే, స్కానింగ్ గదులు, చిన్నపిల్లల వార్డు, కాన్పులు, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. బ్లడ్ స్టోరేజ్ యూనిట్, పురుషుల వార్డు, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, ల్యాబ్, ఐసియు, ఔషధాల నిల్వ కేంద్రం, అత్యవసర విభాగాలను పరిశీలించారు. ఆయా వార్డులలో వైద్యం పొందుతున్న రోగులతో ఆయన స్వయంగా మాట్లాడారు. వైద్యం సక్రమంగా జరుగుతుందా, డాక్టర్లు బాగా చూస్తున్నారా, సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా.? లేదా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా.? అంటూ రోగులతో మాట్లాడుతూనే ఆరా తీశారు. ఆస్పత్రిలో బెడ్ల సామర్థ్యం, ప్రతిరోజు సగటున నమోదయ్యే ఓపీలు, వైద్యం కోసం ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య, అత్యవసర విభాగంలో సేవలు, ఆపరేషన్లు జరుగుతున్న తీరు, ఔషధాల నిల్వలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోగుల వెంట వచ్చిన వారి బంధువులు వేచి ఉండడానికి ఎలాంటి సౌకర్యం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్షాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రభలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికే ప్రభుత్వ వైద్యశాలలు నడుస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలలో 400కు పైగా ఓపీలు నమోదవుతున్నాయని చెప్పారు. ఏడు విభాగాలలో ఓపీలు నడుస్తుండగా, అత్యవసర సేవలు, ఆపరేషన్ల కోసం సగటున ప్రతిరోజు నాలుగు నుంచి ఐదు వరకు బ్లడ్ ప్యాకెట్లు వినియోగిస్తున్నామన్నారు. ప్రస్తుతం బ్లడ్ స్టోరేజ్ విభాగంలో 49 బ్లడ్ ప్యాకెట్లు ఉన్నాయని, వాటి సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు సగటున 80 మందికి ఎక్స్‌రేలు తీస్తున్నామని చెప్పారు. ఈ విభాగంలో కొంత సిబ్బంది కొరత ఉందన్నారు. రోగుల వెంట వచ్చిన వారు వేచి ఉండడానికి అవసరమైన షెడ్ ఏర్పాటు చేస్తామన్నారు. నిధులను సమీకరించి తక్షణమే చర్యలు తీసుకుంటామని లేదా దాతల సహాయంతో సత్వరమే ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన వారంతా ఆరోగ్యవంతులై తిరిగి వెళ్లడమే లక్ష్యంగా డాక్టర్లు పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన వైద్యం సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్తం నిల్వలు పెరిగేలా ▶ 2లో

ఒంగోలులో స్పా సెంటర్లపై దాడులు

16 కేంద్రాలలో ఏకకాలంలో పోలీసుల తనిఖీలు..



ఓ స్పా సెంటర్‌లో పలువురిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన ఒంగోలులోని 16 స్పా, మసాజ్ సెంటర్లపై శనివారం రాత్రి పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఎస్పి దామోదర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఒంగోలు వన్‌టౌన్, టుటౌన్, తాలూకా పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. నగరంలోని స్పా, మసాజ్ సెంటర్లలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదు నేపథ్యంలో ఈ దాడులు చేపట్టారు. నగరంలోని సత్యనారాయణపురం, ఆర్టీసి బస్టాండ్, నెల్లూరు బస్టాండ్, అద్దంకి బస్టాండ్‌లోని సుమారు 16 స్పా, మసాజ్ సెంటర్లలో దాడులు నిర్వహించి.. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. స్పా, మసాజ్ సెంటర్లల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఎంత మందిపై కేసులు నమోదు చేశారనే విషయాన్ని పోలీసు అధికారులు ఆదివారం మీడియాకు వెల్లడించనున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విద్యావ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థే..

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

8లో ▲

భారీ వర్షాల నేపథ్యంలో..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, రేపల్లె

రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం ఎస్పీ స్వయంగా కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి, లోతట్టు ప్రదేశాల పరిస్థితులను గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనుమూడి వంతెన వద్ద కృష్ణానది నది ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం రేపల్లె డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. నదీ పరివాహక ప్రాంతాలలో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడుతున్నాయన్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావం మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుండి నీటిని కిందకి విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు.

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, వాగులు, నదులు ప్రమాద స్థాయిలో ప్రవహించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపునకు గురవడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో నివాసం ఉండే ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాసాలలోకి వెళ్లాలని చెప్పారు. బ్రిడ్జిలు, కల్వర్టుల పై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయవద్దని, ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకోవాలని చెప్పారు. ప్రజలు ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశంతో పోలీసులు సూచించే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అవి మీ యొక్క భద్రత కొరకే అని గ్రహించాలని, ప్రజలు పోలీసుల తక్షణ సహాయం కొరకు డయల్ 100/112 కి లేదా

లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు సేవలందించేందుకు పోలీస్ శాఖ సంసిద్ధం: ఎస్పీ తుషార్ డూడి

స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట రేపల్లె డిఎస్పి టీ.మురళీకష్ణ, రేపల్లె పట్టణ ఇన్స్పెక్టర్ ఎస్.కె నజీర్ బేగ్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నకిలీ పత్రాలతో మోసం.!

(మొదటిపేజీ తరువాయి)

అతని పేరుతో స్టాంపు ఎలా వస్తుందన్నదే ఇక్కడ అనుమానం రేకెత్తించింది. విచారణలో ఈ తప్పిదాన్ని గుర్తించారు. స్టాంపు ఫేక్ అని తేలింది. అగ్రిమెంటు, సంతకాలు అన్నీ ఫేక్‌గానే భావించారు. పోలీసులు దీనిపై చీటింగు కేసు నమోదు చేశారు. భూమిని నకిలీపత్రాలతో కాజేసే వ్యవహారం సాగిందని ప్రాథమికంగానే గుర్తించారు.

కేసు నుంచి తప్పించుకునేందుకు కోర్టుకు..

నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేసే యత్నంగా తేలిపోవడంతో పాటు పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ కేసును పక్కదారి పట్టించేందుకు, దాన్నుంచి రక్షించుకునేందుకు ఈ పత్రాలతో ఆ కార్పొరేటర్ కోర్టులో కేసు వేశారని బాధితులు చెబుతున్నారు. దీన్ని వివాదంగా మార్చేందుకు ఈ మార్గం ఎంచుకున్నారని వాపోతున్నారు.

బాధితురాలి సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు..

బాధితురాలు కూడా కోర్టును ఆశ్రయించారు. ఫోర్జరీ సంతకాలతో తన భూమిని కాజేసేందుకు ఫేక్‌పత్రాలు సృష్టించారని కోర్టుకు విన్నవించారు. దీంతో బాధితురాలు వేలిముద్రలూ, సంతకాలను తీసుకుని నిర్ధారించేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నారు. ఇవి తేలాల్సి ఉంది. అప్పటివరకూ కేసు విచారణలో ఉన్నట్లే..

ఈ భూమినే కొన్నవారిపైనా వేధింపులు

ఈ భూమిని యజమాని రంగనాయకమ్మ నుంచి కొనుగోలు చేసిన కొందరిని కార్పొరేటర్ వేధిస్తున్నారని సమాచారం. కొన్న బాధితులు అటు ఎమ్మెల్యే దామచర్ల వద్దకూ పోతున్నారు. గతంలోనూ ఈ భూమి వ్యవహారంపై అప్పటి ఎమ్మెల్యే వద్ద కూడా పంచాయితీ నడిచినట్లు చెబుతున్నారు. అప్పట్లో ఉన్న భూ కుంభకోణాల పరంపరలో ఆయన దీన్ని సీరియస్‌గా తీసుకుని ఆ కార్పొరేటర్‌కు సహకరించలేదంటున్నారు.

ఒంగోలులో ఎటూ తేలని కేసులు

ఎన్నికలకు ముందు నగరాన్ని నకిలీ పత్రాలు, భూ వివాదాలు వణికించాయి. నకిలీపత్రాలతో భారీగా కబ్జాలు జరిగాయి. వాటిపై సిట్ ఏర్పాటైంది. 150 మందికి పైగా బాధితులు పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. వాటిపై విచారణలు నడుస్తున్నాయి. ఎన్నికలు రావడంతో అవన్నీ మరుగునపడ్డాయి. ఎటూ తేల్చనందున బాధితులు ఇలాగే తిరుగుతున్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలన్నారు. 20 పడకల స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ జిల్లాలో సమర్థవంతంగా నడుస్తుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులు అనారోగ్యానికి గురైతే ప్రత్యేక యూనిట్‌లో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుల వ్యవధిలో జన్మించిన ఏడుగురు శిశువులు ఇక్కడ వైద్యం పొందుతున్నట్లు వివరించారు. ఐసియు విభాగం బాగా నడుస్తుందన్నారు. ప్రాంతీయ వైద్యశాలలో మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రోగులతో మాట్లాడినప్పుడు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, వైద్యుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన విషయాలను తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుకుమార్, అక్కడకు చేరుకున్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

ముందస్తు జాగ్రత్తలపై సమన్వయం కీలకం

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావుతో కలసి డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య భద్రతపై సంబంధిత శాఖల అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, పట్టణ స్థాయిలో వైద్యారోగ్య, ప్రజారోగ్య, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది బాధ్యతగా, విధిగా పనిచేస్తేనే ప్రజారోగ్య భద్రత సాధ్యమవుతుందన్నారు. సంబంధిత అధికారులు తప్పకుండా ప్రతిరోజూ విధులకు హాజరవుతూ కిందిస్థాయి సిబ్బందిని సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై ఏఎన్ఎం, ఆశ, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల సీజనల్ డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ పరిధిలోని అన్ని రకాల మంచినీటి పథకాల నిర్వహణలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రతి శుక్రవారాన్ని డ్రైడే గా కాకుండా ప్రతి రోజు డ్రై డే గా పాటించాలన్నారు. ప్రతి రోజు డ్రై డే అమలు జరిగేలా మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్, తహసిల్దార్లను, డివిజన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు వేడి నీటిని తాగడం, స్వీయ పరిశుభ్రతను పాటించడంపై అవగాహన, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడా డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి కేసులు రాకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా డయేరియా కేసులు గుర్తిస్తే ఆయా గ్రామాల్లో తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా హాస్టళ్లలో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మంచినీటి సదుపాయాలు, వాటర్ ట్యాంకుల పారిశుధ్యంపై సంక్షేమ శాఖల అధికారులు, విద్యా శాఖాధికారులు, ఐసిడిఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వంట మనుషులకు వంట నిర్వహణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి భోజన శాలలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్లలో విధిగా పారిశుధ్య చర్యలను చేపట్టాలన్నారు. పాఠశాలల పరిధిలోని వాటర్ ట్యాంకులూ, కుళాయిలు, మధ్యాహ్న భోజన నిర్వహణ చర్యలను పరిశీలించాలన్నారు. తరచూ నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించి ఉపయోగించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచి తరచూ శానిటేషన్ చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, డివిజన్ స్థాయిలో డివిజన్ స్థాయి అధికారులు ఈ విషయాలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫెరెన్స్‌లో జిల్లా పరిషత్ సిఈవో కె.మాధురి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజన, వివిధ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయిలో డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మృతి చెందిన గేదెలు

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతిచెందిన సంఘటన మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో శనివారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన గిలకా కోటేశ్వరరావు, ఐనేని వెంకట నారాయణలకు చెందిన రెండు గేదెలు మేపు కోసం ఆ గ్రామానికి చెందిన చిన్న పాపయ్య పొలం దగ్గరకు వెళ్లాయి. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువలో ఏర్పాటు చేయడంతో ఆ రెండు గేదెలు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క గేదె విలువ రూ.50 వేల ఉంటుందని బాధితులు వాపోయారు. బాధితుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి కోరారు.



ఎంపీ మాగుంటకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

ఎంపీ మాగుంటను కలిసిన రైల్వే గతిశక్తి అధికారి

ఆధునికీకరణ పూర్తి చేయాలని కోరిన ఎంపీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విజయవాడ మాగుంట కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని రైల్వే గతిశక్తి అధికారి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి టంగుటూరు, సూరారెడ్డి పాలెం, కరవది, అగ్రహారం గేట్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని శ్రీనివాస్‌ను కోరారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ మాగుంట కోరారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కాన్సర్‌పై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. మంచి ఆహారం, జీవన శైలి, వ్యాయామాల ద్వారా కాన్సర్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. కొవ్వు పదార్థాలు ఎక్కువ తీసుకుంటే పొట్ట కాన్సర్ రావటానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆయుర్వేద వైద్యశాల డా.లక్ష్మీభాయి, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఎంఈవో బత్తల నాగేంద్రవదన్, పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై సిఎం దృష్టి పెట్టాలి

తక్షణమే వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయని తక్షణమే ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలని, వరదలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. శనివారం ప్రకాశం జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయని, పుంగనూరులో వైసిపి ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి సరి కాదన్నారు. గతంలో వైసిపి చేసిన తప్పులు ప్రస్తుతం టిడిపి చేస్తే రెండు పార్టీలకు తేడా ఏమిటని ప్రశ్నించారు. పుంగనూరు లాంటి ఘటనలు మళ్లీ రాష్ట్రంలో చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి స్పందించాలని సూచించారు. కక్ష సాధింపు రాజకీయాలు పక్కనపెట్టి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలపై దష్టి పెట్టాలని కోరారు. రాష్టంలో భారీ వర్షాలు, వరదలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, వరదలకు దెబ్బతిన్న రైతులకు రైతు భరోసాలో రూ. 20 వేలు అందజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి పాల్గొన్నారు.

వెంకటేష్ మృతదేహం లభ్యం



బాణాల వెంకటేష్ (ఫైల్)

ప్రజాశక్తి-టంగుటూరు

ఈత కొట్టడానికి వెళ్లి గల్లంతయిన వాసేపల్లిపాడుకు చెందిన బాణాల వెంకటేష్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఈతకు వెళ్లి ఇద్దరు గల్లంతవగా శుక్రవారం నల మాలపు నీవీన్ మృతదేహం లభ్యం కాగా శనివారం ఉదయం గాలింపు చర్యలు కొనసాగించి వెంకటేశ్ మృతదేహం కూడా వెలికి తీశారు. బాణాల వెంకటేష్ ఆలియాస్ శ్యాంబాబు స్వగ్రామం వేటపాలెం. చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో వాసేపల్లిపాడులోని నాయనమ్మ సోమమ్మ వద్ద ఉంటున్నాడు. రక్త సంబంధిత వ్యాధి కారణంగా వెంకటేష్‌కు ప్రతినెలా రక్తం మార్పించాల్సి వుంది. తల్లిదుండ్రులు లేని వెంకటేష్‌ని నాయనమ్మే కంటికి రెప్పలా చూసుకుంటోంది. అటువంటి మనవడు మృతదేహం చూసి కన్నీరు మున్నీరు అయింది. మృతదేహాన్ని శవ పంచనామా కోసం ఒంగోలులోని రిమ్స్ వైద్యశాలకు తరలించినట్లు టంగుటూరు ఎస్సై పున్నారావు తెలిపారు.

మహిళల భద్రతకు పెద్దపీట

లైంగిక దాడులకు పాల్పడితే ఉపేక్షించను

జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మహిళలు, పిల్లల భద్రతకు పెద్ద పీట వేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా మహిళలు, పిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పలు పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలకు వెళ్లిన జిల్లా ఎస్పీ సత్వరం ఒక బాధితురాలికి న్యాయం చేకూర్చారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఒంగోలులోని ఉమన్ పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేయటానికి వెళ్లి అక్కడి ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న క్రమంలో ఒంగోలుకు చెందిన బాధితురాలు ఒక ఆకతాయి తన పదేళ్ల కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించగా మరొక వ్యక్తి తన భర్తపై దాడి చేసి పారిపోయినట్లు ఎస్‌పి దృష్టికి తీసుకొని వచ్చారు. జిల్లా ఎస్‌పి ఫిర్యాదును సావధానంగా విని వెంటనే సిసిఎస్ పోలీసులను రంగంలోకి దించారు. తక్షణమే గాలింపు చర్యలు చేపట్టి స్వల్ప వ్యవధిలోనే ఒంగోలు వంటవారి కాలనీకి చెందిన మిట్ట అనిల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆ వ్యక్తి ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు కావటంతో అతనిపై రౌడీ షీట్ తెరిచారు. తన ఫిర్యాదుపై స్పందించి సత్వరమే న్యాయం జరిగేలా చేసిన జిల్లా ఎస్‌పి, పోలీసులకు బాధితురాలు వారి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా మహిళలు, పిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలు, లైంగిక దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రహదారులు, భవనాల శాఖ ద్వారా చేపట్టి పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరెట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆర్ అండ్ బి శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా చేపడుతున్న, పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యవసరంగా చేపట్టవలసిన రోడ్డు మరమ్మతుల పనుల ప్రతిపాదనలు తయారుచేసి నివేదించాలని కలెక్టర్, ఆర్ అండ్ బి శాఖ ఎస్ఈను ఆదేశించారు. ఈ సందర్భంగా రహదారులు భవనాల శాఖ ద్వారా చేపడుతున్న మరియు ప్రతిపాదిత పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ దేవానందం, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు డిమాండ్ చేశారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో టోల్ ప్లాజా నుండి సింహపురి ఎక్స్ ప్రెస్ వే లిమిటెడ్ కార్యాలయం వరకు శనివారం ర్యాలి నిర్వహించారు. కార్మికులు న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేశారు. 2004లో బొల్లాపల్లి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నట్లు చెప్పారు. గత 20 ఏళ్లుగా సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేటి ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడానికి టోల్ ప్లాజా యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతి నెల బోనస్ అందించాలని, పెండింగులో ఉన్న పాత బకాయిలు చెల్లించాలని కోరారు. జాతీయ రహదారిపై విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలని కోరారు. గతంలో మాదిరి ఉద్యోగులకు పని సర్దుబాటు సౌకర్యం కల్పించాలని అన్నారు. విధులు నిర్వహిస్తున్న ప్రతి కార్మికుడికి రెండున్నర రోజులు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హౌస్ కీపింగ్ సిబ్బందిని యధావిధిగా కంపెనీ సిబ్బందిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన క్యాంటీన్ తిరిగి పునరుద్ధరించాలని, సబ్సిడీతో కూడిన భోజన సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి లేని సమయంలో సిఐటియు ఆధ్వర్యంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి రాజశేఖర్, సిరికొండ శ్రీనివాసరాజు, కోశాధికారి తొట్టెంపూడి కిషోర్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

విద్యుత్ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష

ప్రజాశక్తి - అద్దంకి

ఎపిసిపిడిసిఎల్ అధికారులతో అమరావతి నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వర్చువల్‌గా సమీక్షించారు. అల్పపీడన ప్రభావంతో వివిధ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం ప్రభావిత జిల్లాల అధికారులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. వర్షాల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. లంక గ్రామాల ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వర్షాలు, వరదలతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్ల కుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ స్థంభాలు, వృక్షాలు నెలకొరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభించాలని చెప్పారు. మంత్రి ఆదేశాలతో వరదలో చిక్కుకున్న ఏలూరు జిల్లా మాదేపల్లి గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి అధికారులు తరలించారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - యద్దనపూడి

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఎపి సిఎన్ఎఫ్) శనివారం సిఐటియు సభ్యత్వం తీసుకొని సమావేశం నిర్వహించారు. మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. సమావేశనికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు హాజరై మాట్లాడారు. సిబ్బంది ఎవరైనా విధులు సక్రమంగా నిర్వహించి శాఖా పరంగా ఉన్న తమ సమస్యలు పరిస్కారం కోసం ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కోటిబాబు, ఉపాధ్యక్షులు వెంకట రత్నం, సభ్యులు మెరిసిమ్మ, అంజనాదేవి, నరేష్, అనూష, పాపారావు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - చీరాల

ప్రస్తుత వర్షాల సీజన్లో అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మునిసిపల్ కమీషనర్ కె చక్రవర్తి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా వెళ్లి శనివారం పరిశీలించారు. స్వర్ణరోడ్డు, గడియార స్తంభం, మసీదు సెంటర్, ముక్కోణము పార్కు, దండుబాట రోడ్డు, పోలేరమ్మ గుడి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజిలో నిల్వ ఉన్న సిల్టు, చెత్త తొలగింపు పనులు చేయించారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, పారిశుద్ధ్య మేస్త్రులు పాల్గొన్నారు.

నేడు బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - చీరాల

బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిసి కులాల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు ఫెడరేషన్ నాయకులు సిహెచ్ మస్తాన్‌రావు, యోనమల యానాదిరావు తెలిపారు. రోటరీ కమ్యూనిటీ హాల్లో జరిగే కార్యక్రమానికి శాసన సభ్యులు ఎంఎం కొండయ్య హాజరవుతారని చెప్పారు. ఎమ్మెల్యేను బీసీ కులాల ఆధ్వర్యంలో సన్మానం చేయనున్నట్లు తెలిపారు. అన్ని బీసీ కులాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కృష్ణానది వరదపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రకాశం బ్యారేజీ నుండి విడుదల చేసిన వరద నీటితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డిఓ హేల షారోన్ సూచించారు. మండలంలోని పెదలంకలోని కాకులు డొంక వద్ద, ఓలేరు గ్రామ వద్ద కృష్ణా నదిని శనివారం ఆమె పరిశీలించి అధికారులతో శనివారం సమీక్షించారు. నదికి వరద నీరు ఎంత విడుదల చేస్తే పంట పొలాలకు, గ్రామాలకు ఇబ్బంది కలుగుతుందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. నదికి వరద నీటిని అధిక మొత్తంలో విడుదల చేస్తే ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కృష్ణా నదిని పరిశీలించిన అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వరద ఉధృతి పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పశువులను నదీ లంకలల్లోకి మేతకు తరలించరాదని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా అప్రమత్తం చేయాలని అన్నారు. గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పంచాయతీ అధికారులు బ్లీచింగ్, సున్నం వంటి వాటిని సిద్ధం చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఓ మల్లికార్జునరావు, ఆర్ఐ శివరామకృష్ణ, వైద్యాధికారులు డిఎల్ పద్మజ, రామలక్ష్మి, పిఆర్ ఎఈ రామచంద్రరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎఈ శివశంకర్, ఇరిగేషన్ ఎఈ రవిబాబు, పశు వైద్యులు రంజిత, పంచాయతీ కార్యదర్శులు బి పుష్పలత, ఎ శ్రీదేవి, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వరద నీటిపై సమీక్షిస్తున్న ఆర్డిఓ హెలా షారోన్

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

వ్యక్తిగత కక్షలతో వినుకొండలో జరిగిన ఘటనను అడ్డం పెట్టుకుని వైసిపి శవరాజకీయాలు చేస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో టిడిపి కూటమి నాయకులు నిరసన సమావేశం శనివారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ ఘటనపై వైసీపీ చేస్తున్న శవ రాజకీయాలు వెంటనే మానుకోవాలని అన్నారు. వినుకొండలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో జరిగిన హత్యకు రాజకీయాన్ని పూసి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వికృత ఆనందం పొందుతున్నారని అన్నారు. తండ్రి, బాబాయ్, కోడి కత్తి డ్రామాలు చూసిన అనంతరమే వైసీపీని ప్రజలు 11సీట్లుకు పరిమితం చేసారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసరావు, శివరాంప్రసాద్, చంద్ర, రత్నబాబు, సయ్యద్ బాబు, వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను

పాఠశాలకు వంట సామగ్రి బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సౌజన్యంతో పట్టణంలోని కట్టకిందపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్యాస్ స్టవ్, వంట పాత్రలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచి మంచి అలవాట్లు, క్రమశిక్షణతో చదివి వృద్ధిలోకి రావాలని కోరారు. విద్యాలయాలకు సహాయం చేయడమంటే పుట్టంరాజుకి ఎంతో ఇష్టమని అన్నారు. ఆయన అభినందనీయుడని రోటరీ అధ్యక్షుడు వీరయ్య పేర్కొన్నారు. శ్రీరామ చంద్ర మూర్తిని రోటరీ ప్రతినిధులు సన్మానించారు. హెచ్ఎం సుబ్బారావు అధ్యక్షత వహించిన సభలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మొహమ్మద్ రఫీ, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు దేవపాలన, పువ్వాడ రామకోటేశ్వరావు, తాళ్లూరి బాబురావు, ఉపాధ్యాయిని సందిరెడ్డి శ్యామల పాల్గొన్నారు.



పుట్టంరాజును సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్న ప్రసాద్

డ్రైన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రస్తుత వర్షాకాల సీజన్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి రత్నప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాసమూర్తి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో మురుగునీటి కాల్వల పూడికతీయాలని చెప్పారు. కాలువలు ఆధునీకరణ చేయాలని చెప్పారు. వ్యర్థాలు తొలగించాలని అన్నారు. అధిక వర్షాలు పడినప్పుడు పంటలకు నష్టం లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులు, అంటు రోగాలు రాకుండా ఇంటింటికి వెళ్లి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నాక్ బృందంతో కళాశాల నిర్వాహకులు

మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలకు నాక్ గుర్తింపు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలకు నాక్ (ఎన్ఎఎసి) బి గ్రేడ్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ అన్నదానం హనుమత్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాక్ గుర్తింపు పొందిన ఏకైక కళాశాల తమదేనని అన్నారు. 52ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర గల కళాశాల నుండి ఎందరో విద్యావంతులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. విశ్వ విద్యాలయ స్థాయిలో ఎన్నో బంగారు పతకాలు సాధించారని అన్నారు. ఉన్నత ప్రమాణాలతో కళాశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునికి సాంకేతిక సౌకర్యంతో ల్యాబ్‌లు, ప్రయోగాత్మక ప్రోత్సాహం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ ట్రస్టీ గిరిధర్ కుమార్, కరస్పాండెంట్ గోగినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

'అందుబాటులో' అంటే ఆమడ దూరమా?

ఊరుకు దూరంగా రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కురిచేడు

పరిపాలనను ప్రజల వద్దకే తేవడానికి రాష్ట్రంలోని గత ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆ సచివాలయంలో ప్రజలకు కావాల్సిన అన్ని ప్రభుత్వ పథకాలనూ ఒక గొడుగు కిందకు తెచ్చి ప్రజలకు పనులు వెంటనే జరిగేటట్లు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. అప్పటి ప్రభుత్వం కోట్లు వెచ్చించి గ్రామ సచివాలయాలను నిర్మించారు. కురిచేడు మండలంలోని 15 పంచాయతీల్లో 11 సచివాలయాలు నిర్మించగా వాటిలో 9 సచివాలయాలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. మిగతా రెండు సచివాలయాలు నిర్మించి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ అవి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ప్రజల వద్దకే పాలన అని ప్రభుత్వం చెబుతుండగా దానికి విరుద్ధంగా కురిచేడులో మాత్రం సచివాలయానికి రావాలంటే ఆరు కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి ఏర్పడింది.

కురిచేడు మేజర్ పంచాయతీలో మొత్తం నాలుగు గ్రామాలు ఉన్నాయి. కురిచేడుకు సచివాలయం-1 గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మాణం చేపట్టారు. రెండో సచివాలయం పేరంబొట్లపాలెం, కాటంవారిపల్లె, గొల్లపాలెం మూడు గ్రామాల ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందించడానికి ఎన్ఎస్‌పి కాలనీలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల వెనుక భాగాన నిర్మించారు. ఈ మూడు గ్రామాల నుంచి ప్రజలు ఆ సచివాలయానికి పనుల కోసం రావాలంటే ఆ గ్రామాల నుంచి ఎటువంటి రవాణా సౌకర్యం లేదు. అత్యవసరంగా రావాలి అంటే కురిచేడు నుంచి ఆటో పిలిపించుకొని సచివాలయానికి రావాల్సిందే. చిన్న చితక పనుల కోసం కురిచేడు రావాలంటే ఆ మూడు గ్రామాల ప్రజలు ఆరు కిలోమీటర్లు దూరం నడిచి రావాల్సి ఉంది.



ఆరు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన సచివాలయ భవనం

ప్రభుత్వ పరిపాలన ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్న మాటలు చేతలలో నీరుగారి పోయింది. ఇప్పటికైనా అధికారులు సచివాలయం-1ని ఆ మూడు గ్రామాలకు కేటాయించి, సచివాలయం-2ను కురిచేడుకి కేటాయిస్తే కొంతమేరకైనా ప్రజలకు ఇబ్బంది తొలగించినవారవుతారు. ప్రజల బాధలు పట్టించుకునే రాజకీయ నాయకులు ఉంటే వారి బాధను అర్థం చేసుకొని వారి కష్టాన్ని తొలగించడానికి ప్రయత్నం చేస్తారని ఆశిద్దాం.

ఒక రోజు పని మానుకోవాల్సి వస్తోంది

కాటం చిన్న కోటిరెడ్డి (కాటంవారిపల్లె)



ప్రజలకు పాలన అందుబాటులోకి తెస్తామని చెప్పిన రాజకీయ నాయకులు మా మూడు గ్రామాలకు తీవ్ర అన్యాయం చేశారు. మా గ్రామాలలో ప్రభుత్వ భూమి ఉన్నా, సచివాలయ భవనాలు నిర్మించడానికి మా భూములు ఇస్తామన్నా తీసుకోకుండా, మాకు అందుబాటులో లేకుండా ఆరు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అక్కడికి పోవాలంటే ఒకరోజు పనిమానుకొని వెళ్లాల్సి వస్తోంది.


సర్టిఫికెట్లు చూయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త గోవిందమ్మ, యూనియన్ నాయకులు

అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గుమ్మళంపాడు గ్రామ శివారు బొడ్డ పాటివారిపాలెం అంగన్‌వాడీ కార్యకర్త గంగవరపు గోవిందమ్మపై వేధింపులు ఆపాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ కోరారు. సంతనూతలపాడు యూనియన్ కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ మండలంలోని గుమ్మళంపాడు గ్రామ శివారు బొడ్డపాటివారిపాలెం లో 2014 ఫిబ్రవరి 24 నుంచి అంగన్‌వాడీ ఆయాగా గంగవరపు గోవిందమ్మ విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆ సెంటర్లో పనిచేస్తున్న కార్యకర్త 30/6/2018న రిటైర్ అయ్యారని తెలిపారు. అప్పటికే ఆ సెంటర్లో ఆయాగా పనిచేస్తున్న గోవిందమ్మకు ప్రమోషన్‌కు అర్హత ఉన్నా అప్పటి అధికారులు కావాలని నోటిఫికేషన్ వేశారని అన్నారు. దాంతో ఆయాగా పనిచేస్తున్న గోవిందమ్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నోటిఫికేషన్ రద్దు అయిందని తెలిపారు. ఆ విషయమై యూనియన్ ఆధ్వర్యంలో 5 సంవత్సరాలు పోరాడటంతో 7/6/24న గోవిందమ్మకు కార్యకర్తగా ప్రమోషన్ వచ్చిందని తెలిపారు. కొంతమంది కావాలని సర్టిఫికెట్లు లేవనే పేరుతో అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు. పత్రికా ముఖంగా అన్ని సర్టిఫికెట్లను ఆమె చూయించారు. ఇప్పటికైనా వేధిస్తున్నవారు వెంటనే తమ వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో యూనియన్ జిల్లా వ్యాప్తంగా గోవిందమ్మకు అండగా నిలిచి పోరాడుతుందని అన్నపూర్ణ హెచ్చరించారు. పత్రికా సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, మద్దిపాడు ప్రాజెక్టు కార్యదర్శి నాతాని ధనలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, కార్యకర్త గోవిందమ్మ పాల్గొన్నారు.

గుంటి గంగమ్మకు సారె

ప్రజాశక్తి-దర్శి

శ్రీగుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆషాఢ మాస సారె సమర్పించారు. తూర్పుగంగవరం, సోమవరప్పాడు గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు ప్రదర్శనగా ఆలయం వద్దకు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొసన గురుబ్రహ్మం తగు ఏర్పాట్లు చేశారు.


తాళ్లూరు మండలం గుంటి గంగమ్మ అమ్మవారికి చీర, సారె ఇస్తున్న గంగవరం మహిళలు


మాంసం మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మాంసం మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ వెనుక వైపు ఉన్న మాంసం మార్కెట్‌ను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం పరిశీలించారు. మార్కెట్‌ను ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ రంగారావును ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యం చేయవద్దని సూచించారు. కనిగిరి మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు నిధుల మంజూరుకు తాను కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, సద్గురు, తమ్మినేని వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-దర్శి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నాయకులు తిండి నారాయణరెడ్డి అన్నారు. శనివారం దర్శి గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ మొక్కలను విద్యార్థులు బతికించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అన్నదానం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

అన్నదానంలో జడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-దర్శి

దర్శి ముస్లిం బజారులో మొహరం ముగింపు సందర్భం గా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని అన్నదానం చేశారు.


ప్రభుత్వ వైద్యశాలలో మొక్కల నాటుతున్న డాక్టర్ సుమన్

వైద్యశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రజాశక్తి-దర్శి

దర్శి ప్రభుత్వ హాస్పటల్‌లో దర్శి ప్రధాన వైద్యాధికారి సుమన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా, డాక్టర్ సుమన్ మాట్లాడుతు పచ్చదనం-పరిశుభ్రత పరిరక్షణ కోసం మనమందరం పాటుపడాలని అన్నారు. షేక్ మహ్మద్‌రఫీ మాట్లాడుతూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గాలంటే ప్రతిమనిషి బాధ్యతగా వారి ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలని అన్నారు. డాక్టర్ గీత పద్మ మాట్లాడుతూ చెట్లు నరకడం వలన వర్షాలు సరిగా పడవని అన్నారు. లక్ష్మి పూజిత, డాక్టర్ మోహన్, శివకుమార్, టీడీపీ ప్రకాశం మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


డొక్కా సీతమ్మ అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దర్శి జనసేన ఇన్‌ఛార్జి గరికపాటి వెంకట్

త్వరలో డొక్కా సీతమ్మ అన్నదానం

ప్రజాశక్తి-దర్శి: దర్శిలో కూడా త్వరలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు దర్శి జనసేన ఇన్‌ఛార్జి గరికపాటి వెంకట్ అన్నారు. శనివారం ఒంగోలులో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు డక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాలను ఒంగోలులో చేయడం అభినందనీయమని అన్నారు. తాను కూడా దర్శిలో ప్రారంభిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బీఎన్‌ను కలిసి బొకే ఇస్తున్న ఏఓ పావని

ఎమ్మెల్యే బీఎన్‌ను కలిసిన ఏఓ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి పావని శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను ఎమ్మెల్యేకు ఏఓ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుబ్బారెడ్డి, మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేడు గురు పూర్ణిమ వేడుకలు

ప్రజాశక్తి-దర్శి: దర్శిలోని ఎన్ఏపీ చెరువు వద్ద శివరాజ్ నగర్ సమీపాన గురుపూర్ణిమ వేడుకలు శ్రీనాగసాయి దత్తాశ్రమంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 4:30 గంటల నుంచి 11 గంటల వరకు పూజ హారతి, అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదానం జరుగుతాయని తెలిపారు. ప్రశాంత స్కూల్ వారి విద్యార్థుల చేత కోలాట ప్రదర్శన కూడా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



సచివాలయాన్ని తనిఖీ చేసిన జెసి గోపాలకృష్ణ

సచివాలయాన్ని సందర్శించిన జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ శనివారం ఉదయం కొత్తపట్నం మండలం, అల్లూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ వివరాలు, వెరిఫికేషన్ ప్రక్రియలో వస్తున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంయుక్త కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఒ జివి సుబ్బారెడ్డి ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో సుభద్ర

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూళ్లను జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే ఉప్పుగుండూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాగులుప్పలపాడు హైస్కూల్లో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలుత విద్యావనరుల కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు టి.రవి, ఇ.వి.రమణయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతులకు జొన్న విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

గొంతువాపు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

పశువుల్లో గొంతువాపు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డా.కె.బేబీ రాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏడుగుండ్లపాడులోని రైతు సేవా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. పశుపోషకులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందిస్తున్న జొన్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు జొన్న విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పశుపోషకులు ఉన్నారు.

దారులు ఇలా.. నడిచేదెలా..!

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి
- దోమల ఉధృతితో ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-తర్లుపాడు

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. మరి అలాంటి పల్లెలు పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు సౌకర్యాలు కల్పించి, ఎలాంటి జబ్బుల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత పాలకులు, అధికారుల మీద ఉంది. కానీ మండల కేంద్రమైన తర్లుపాడులోని పలు వీధులలో, కాలనీలలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా బీసీ ముతరాశి కాలనీలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో ఈ కాలనీ వాసులకు పట్టాలు పంపిణీ చేశారు. 42 సంవత్సరాలు పూర్తవుతున్న బీసీ కాలనీ అభివృద్ధికి మాత్రం నోచుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



కుళాయిలు ఏర్పాటు చేయక నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

చిన్నపాటి వర్షానికే బురదమయం..

చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. ఈ రోడ్లపై చిన్నపిల్లలు, వృద్ధులు నడవడానికి సైతం ఇబ్బందులు గురవుతున్నారు. అడుగు తీసి అడుగు బయట పెట్టలేని దుస్థితిలో కాలనీ వాసులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కాలనీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదర్శ కాలనీ, స్వచ్ఛభారత్ పథకం క్రింద రూ.2 కోట్ల 70 లక్షలు సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించేందుకు మంజూరయ్యాయి. అప్పటి మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారు. అనంతరం నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే, అధికారుల పర్యవేక్షణ లేకుండానే తూతూ మంత్రంగా రోడ్లకు మూలమలుపులలో మూతలు పూర్తిగా వేయకుండానే సైడ్ కాలువలను నిర్మించి మమ అనిపించారు. ఆ మూతలు లేని సైడు కాలువల్లో పలు వాహనాలు, చిన్నపిల్లలు, వృద్ధులు పడిపోయి గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇక సీసీ రోడ్లు విషయానికి వస్తే కేవలం ఒక్క రోడ్డు మినహా మిగతా రోడ్లు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతర్గత రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు ఉధృతమై కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. దీంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముతరాసి కాలనీలో బురదమయంగా ఉన్న అంతర్గత రోడ్డు

ఎక్కడి చెత్త అక్కడే..

కాలనీలోని రామాలయం అనుకుని ఉన్న ఒకే ఒక నీటి ట్యాంకికి కుళాయిలు కూడా లేవు. నివాసాలలోని చెత్తను సేకరించే పారిశుధ్య కార్మికులు నెలకోసారి మొక్కుబడిగా తీసుకెళ్తుండడంతో చెత్త కుప్పలు కుప్పలుగా ఇళ్ల మధ్యలోనే పేరుకుపోతోంది. కాలనీకి కనీస సౌకర్యాలు కరువయ్యాయి అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల పాలనలో అటు అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ ఈ కాలనీ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని వారు వాపోతున్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే, ఇక గ్రామాల పరిస్థితి ఏంటంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని బీసీ కాలనీ అభివృద్ధికి పాటుపడాలని కాలనీవాసులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని జమ్ములపాలెం ఉన్నత పాఠశాలలో షూటింగ్ బాల్ సెలక్షన్లు శనివారం జరిగాయి. జిల్లా నలుమూలల నుండి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలో ప్రతిభ కనపరచిన బాల బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 10, 11 తేదీలలో కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తారని షూటింగ్ బాల్ గౌరవ అధ్యక్షుడు జి.మురళీ, జమ్ములపాలెం హైస్కూల్ పిడి.అశోక్ బాబు తెలిపారు.

దేవాదాయశాఖ పరిధిలోకి ఆంజనేయస్వామి దేవస్థానం

ఆలయంలో వస్తువులను స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి -గిద్దలూరు

పట్టణంలోనీ రేడియో బావి సెంటర్ వద్ద ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఉత్తర్వుల మేరకు సింగిల్ ట్రస్టీగా కొనసాగుతున్న పాలుగుళ్ల అనసూయమ్మ నుండి దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకున్నట్లు గిద్దలూరు గ్రూప్ దేవస్థానముల కార్యనిర్వహణాధికారి చిక్కుడు శ్రీనివాసులు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో దేవస్థానంలోని విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి నుంచి ఆలయ పరిపాలన విధులు కార్యనిర్వహణాధికారి పరిధిలో ఉంటాయని ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

అధ్వానంగా శ్మశాన వాటికలు

- చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తర్లుపాడు-ప్రజాశక్తి

మండలంలోని గ్రామాల్లో శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకి తగినట్లుగా వైకుంఠ ధామాలను అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు ఆఖరి మజిలీలో నానా అవస్థలు పడుతున్నారు. గత టీడీపీ హయాంలో పలుచోట్ల ఉపాధి హామీ పథకం పనుల ద్వారా శ్మశానాలు అభివృద్ధి చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనుల ద్వారా శ్మశానాల అభివృద్ధిని నిలిపివేసింది. ప్రస్తుతం కూడా ప్రభుత్వం శ్మశానాల అభివృద్ధికి శ్రీకారం చుడుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రమైన తర్లుపాడులో నాలుగు స్మశాన వాటికలు ఉన్నాయి. తర్లుపాడు, మార్కాపురం రోడ్డులోని హిందూ స్మశాన వాటికలో పరిస్థితి అధ్వానంగా ఉంది. చిల్లచెట్లు గుబురుగా పెరిగి అడవిని తలపిస్తోంది. శ్మశానమంతా దట్టమైన పిచ్చి చెట్లు, చిల్లచెట్లే కనిపిస్తున్నాయి. కనీసం ఆరడుగుల స్థలం కోసం, గంటల తరబడి చెట్లను తొలగించుకుని వెతుక్కోవలసిన దుస్థితి



శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

నెలకొంది. ఒక స్మశానంలో మాత్రం ఆర్యవైశ్య సంఘం దాతల సహకారంతో రన్నింగ్ నీటి సదుపాయం, దహన సంస్కారాలకు షెడ్లు ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లలో పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలే లేవు. కూటమి ప్రభుత్వమైనా శ్మశాన వాటికల అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో శర్వాణి

ప్రజాశక్తి-కంభం రూరల్

నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారులు బి.మాల్యాద్రి, కె.శర్వాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులుగా ఉంటారనీ, ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా వుంటూ పాఠశాల విద్యలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని అడుగులు వేయాలని సూచించారు. మండలంలోని పాఠశాలల్లో సౌకర్యాలు, అభివృద్ధి మరియు సమగ్ర విద్యా ప్రణాళికలపై చర్చించారు. విద్యా ప్రవేశ్ ద్వారా రోజువారీ కార్యక్రమాలను అమలుచేస్తూ దీక్షా అనువర్తనంలో ప్రవేశించాలనీ, విద్యాశాఖ ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాల వారీగా సమస్యలను సమీక్షించి సందేహ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు, కారుమంచి గ్రామాలకు చెందిన రైతులు 47 పండుగుల్ల బేళ్లను శనివారం అమ్మకానికి తెచ్చారు. పండుగుల్ల అత్యధిక ధర రూ.186, అత్యల్ప ధర రూ.60, సరాసరి ధర రూ.140-96 పలికింది. ఇప్పటి వరకు పండుగుల్ల 4043 క్వింటాళ్ళు. కొనుగోలు జరిగాయి. ముక్క 424 బేళు రాగా అత్యధిక ధర రూ.150, అత్యల్ప ధర. రూ 60, సరాసరి ధర రూ.92-88 పైసలు పలికింది. సూర, ముక్క బేళ్లు ఇప్పటి వరకు 52137 క్వింటాళ్ళు కొనుగోలు చేయగా అత్యధిక ధర రూ.150, అత్యల్ప ధర రూ.60, సరాసరి ధర రూ.100 పలికిందని వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

మారెళ్ల కాశీరత్తమ్మకు ఘన నివాళి

సేవాపురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మారెళ్ల కాశీరత్తమ్మ ద్వితీయ వర్ధంతి ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కాశీరత్తమ్మ చిత్రపటానికి కుటుంబ సభ్యులతో పాటు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయిత దశరథ మారెళ్ళ కాశీరత్తమ్మపై రాసిన ప్రత్యేక గీతాన్ని గాయకుడు శరత్‌బాబు పాడగా.. ఆ దశ్యగీతాన్ని ఆవిష్కరించారు.

ఒంగోలులో ప్రజలకు సేవ చేస్తున్న శివం పౌండేషన్, సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్, బొమ్మరిల్లు అనాథాశ్రమం, ఉషోదయ వద్ధాశ్రమం నిర్వాహకులు ఖాసీం, రాజ్యలక్ష్మి దంపతులు, సర్దార్‌భాషా, గొల్లపూడి శ్రీహరి, కసుకుర్తి కోటమ్మలను సేవ పురస్కారాలతో పాటు రూ.5 వేల నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు.

పేలప్రోలు ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో గుడ్ న్యూస్ మినిస్ట్రీ హాస్టల్‌లో డిగ్రీ చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఫీజుల నిమిత్తం 40 వేల రూపాయలు మరో పేరు విద్యార్థినికి స్కూల్ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వీరితో పాటు ది సేవ్ యానిమల్ ఫౌండేషన్ దివ్య, కాశయ్య స్వామి ఉచిత ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ పి.హరిబాబు. ప్రకాశం నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల ఐక్యవేదిక ప్రచారకర్త నాగేశ్వర్, ఎడిటర్ షాన్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం శివం ఫౌండేషన్, సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ బొమ్మరిల్లు కార్యాలయాల్లో అన్నదానం నిర్వహించారు. ఉషోదయ వద్ధాశ్రమంలోని వద్ధులకు బియ్యం నిత్యవసర వస్తువులు మరియు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పేలప్రోలు రామకష్ణ పరమహంస (బిర్లా), దామచర్ల పూర్ణచంద్రరావు, టి.అరుణ, మండవ లావణ్య. అనంతమ్మ, నామినేని మోహనరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసీరావు, మంచినేని శ్రీనివాసరావు, బత్తుల ముసలారెడ్డి, వైవి సుబ్బారావు, కొల్లా మధు, కొండూరి విశ్వసేన్, మారెళ్ళ వివేకానంద సుబ్బమ్మ, మారెళ్ళ సుబ్బారావు రాజేశ్వరి, కొమ్మి రమణయ్య రాజేశ్వరి, పేలప్రోలు చిలకమ్మ బ్రహ్మానందం, కొమ్మి కష్ణయ్య బుజ్జమ్మ దంపతులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




కాశీరత్తమ్మకు నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

గిరిజన గూడేల్లో వైద్య-శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పోతురాజుపెంట, బిళ్లగొందిపెంట, గౌతమ బుద్ధుని కాలనీలలో శనివారం వెంకటాద్రి పాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి.కోటానాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. గర్భిణీలకు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. చిరు వ్యాధులు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. బాలింతలకు వైద్య సేవలు అందించారు. రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ఐరన్ టానిక్‌లు, మాత్రలు, ప్రొటిన్ పౌడర్లు పంపిణీ చేశారు. డాక్టర్ వి కోటా నాయక్ గిరిజనులకు ఆరోగ్య విద్యను బోధించారు. శిబిరంలో సిహెచ్‌వో ఎన్ మల్లిక, ఎంపిహెచ్‌ఏఎఫ్ రమణమ్మ, ఎంపిహెచ్‌ఏఎం పి ఆవులయ్య, ఏఎన్ఎం నాగలక్ష్మి, సిబ్బంది లక్ష్మి, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు.



ఆరోగ్య విద్యను బోధిస్తున్న డాక్టర్




అర్జీ ఇస్తున్న దృశ్యం

పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి కోరారు. శనివారం చిన్నగుడిపాడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాభావంతో ఒకవైపు కరువైతే, మరోవైపు డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్‌తో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. సున్నా, పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ అసలు కట్టాలని రైతులపై బ్యాంకులో ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వేయాలని తెలిపారు. అలాగే ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించాలని కోరారు. కరువు నివారణకు ప్రత్యేక నిధులు ప్రకటించాలన్నారు. పెట్టుబడి సాయం కుటుంబ ఆధారం కాకుండా ఎకరాల ఆధారంగా కనీసం 10 ఎకరాల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రిప్పు స్పింకర్లపై జిఎస్టి రద్దు చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే జీవో నెంబర్ 22ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంతో రైతు సంఘం నాయకులు రాజాకృష్ణ, ఆంజనేయులు, వెంకట కోటయ్య, వెంకట రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని పెద్ద బొమ్మలాపురం, చిన్నదోర్నాల, కటకానిపల్లి గ్రామాలలో వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కౌలు రైతుకార్డులపై రైతులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితి వల్ల పత్తి పంటకు ప్రత్యామ్నాయ పంటగా కందులను సాగు చేయాలని తెలిపారు. కంది విత్తనాలు 30 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రలలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం కౌలు రైతులను గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండారెడ్డి పోలమ్మ, ఎంపీటీసీ చింతలచెరువు వెంకటరెడ్డి, విఆర్వోలు డి రామయ్య, శ్రీనివాసులు, విహెచ్‌ఏలు నీలా నాయక్, డి. శ్వేత, యం. రాజేంద్ర ప్రసాద్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో

22న జాబ్ మేళా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యున్నత స్థాయి బహుళజాతి ఔషధ తయారీ సంస్థ 'దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్' జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పుగంతుల మధుసూదన్ శనివారం తెలిపారు. జాబ్ డ్రైవ్‌కు హాజరయ్యే వారు బి.ఫార్మశి, ఎం.ఫార్మశి, (పి.ఎ, పి.సి, క్యూ.ఎ, ఆర్.ఎ), బిటెక్-కెమికల్, బి-టెక్ మెకానికల్, బిఎస్‌సి (కెమిస్ట్రీ లేదా మైక్రోబయాలజీ) ఎం.ఎస్‌సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ లేదా అనలిటికల్ కెమిస్ట్రీ) ఐటిఐ (ఎలక్ట్రికల్ లేదా ఫిట్టర్) ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కళాశాల శిక్షణ-ప్రాంగణ నియామకాల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉద్యోగ నియామక ప్రక్రియకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ హాజరై ఉన్నత స్థాయి ఉద్యోగం పొందే విధంగా ప్రయత్నం చేయాలని విభాగం సమన్వయకర్త కె.పవన్‌కుమార్ కోరారు. యాక్టివ్ ఫార్మస్యూటికల్ పదార్థాల తయారీలో ప్రపంచ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచి అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్‌చే పలుమార్లు ఆమోదించబడి రెండు తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడలో ఔషదాల అతిపెద్ద ఉత్పత్తి కర్మాగారాలు కలిగిన దివీస్ నందు ఉద్యోగం చేయాలని ఎంతోమంది ఎదురు చూస్తారని, మార్కాపురం పరిసర ప్రాంత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివీస్ జనరల్ మేనేజర్ కె.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో పాటుగా అన్ని రకాలైన ఉత్తీర్ణతా నకళ్లను వెంట తీసుకురావాలని కోరారు. వివరాల కోసం 9440748307 సెల్ నెంబరు ద్వారా నేరుగా సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు.

'పాలుట్ల'లో సోలార్ వెలుగులు

- కొత్త ప్రభుత్వంపై మిగతా గూడేల గిరిజనుల ఆశలు
- సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అభయారణ్యంలో జీవించే గిరిపుత్రుల్లో చీకటి పడుతుందంటే చాలు ఆందోళన మొదలవుతుంది. కటిక చీకటిలో ఏ జంతువు వచ్చి దాడి చేస్తుందోనని భయం. విషపురుగులు కాటేస్తాయేమోనన్న ఆలోచన వారిని ప్రశాంతంగా నిద్ర కూడా పోనివ్వదు. అదే భయంతో ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్న గిరిపుత్రులు నేడు ప్రశాంతంగా నిద్రపోతున్నారు. రాత్రి వేళ ఏ బెరుకూ లేకుండా బయట తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో సీఎండీఎఫ్ పాలుట్లలోలో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళల్లో సహాయం లేకుండా వాటంతట అవే వెలిగేలా సోలార్ సెన్సార్ లైట్లను వీధుల్లో ఏర్పాటు చేశారు. ఈ వీధి దీపాలు ఆటోమేటిక్‌గా పగలు ఆరిపోతున్నాయి. రాత్రులందు వెలుగుతూ పాలుట్లకు వెలుగులనిస్తున్నాయి.

కొత్త ప్రభుత్వంపై గిరిజనుల ఆశలు..

పాలుట్ల గిరిజన గూడెం తరహాలోనే తమ గూడేల్లో కూడా సోలార్ సిస్టం ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని నెక్కంటి, ఇష్టకామేశ్వరి, నారుతడికల చెంచు గూడేలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. రాత్రులందు క్రూరమృగాలు, విష జంతువులతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోలార్ సిస్టాన్ని ఏర్పాటు చేసి పాలుట్ల తరహాల్లో వీధి దీపాలు వేయించాలని ఆ గూడేల గిరిజనులు కోరుతున్నారు.



పాలుట్లలో వెలుగుతున్న సోలార్ లైట్లు

చీకటి భయం తొలగింది..

రామావత్ బాలకృష్ణా నాయక్, పాలుట్ల



రాత్రిపూట వీధి దీపాలు వెలుగుతుండటం వల్ల ధైర్యంగా బయటకు రాగలుగుతున్నాం. గతంలో చిమ్మ చీకటిగా ఉండేది. ఈ కారణంగా తాము పశువులకు మేత వేయటానికి కూడా బయటికి రావడానికి భయపడేవాళ్లం. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. పిల్లలు కూడా దీపాల కింద కూర్చుని చదువుకుంటున్నారు. చీకటి భయం తొలగింది.

సోలార్ సిస్టంతో వెలుగులు

ఆర్ నాగేశ్వరరావు నాయక్, పంచాయతీ కార్యదర్శి, పాలుట్ల



పాలుట్లలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టంతో ఎవరి సహాయం లేకుండా పగలు వాటంతట అవే ఆరిపోయి చార్జింగ్ చేసుకుంటాయి. రాత్రి వేళల్లో వెలుగుతాయి. ఈ లైట్లు 100 వాట్స్ బల్బు కంటే ఎక్కువగా వెలుగునిస్తున్నాయి.

విద్యావ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థే..

- వాళ్లే లేకుంటే ఉపాధ్యాయులు, అధికారులు అవసరం లేదు..
- విద్యార్థుల అభినందన సభలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-పంగులూరు

విద్యా వ్యవస్థ మొత్తానికి కేంద్ర బిందువు విద్యార్థి అని, విద్యార్థి లేకుండా విద్యావ్యవస్థ లేదని శాసనమండలి సభ్యులు కెఎస్. లక్ష్మణరావు అన్నారు. విద్యార్థి ఉంటేనే విద్యా వ్యవస్థ మొత్తం ఉంటుందన్నారు. 2024 మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో మండలస్థాయిలో 550పైగా మార్కులు పొందిన, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు, 2023లో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల అభినందన సభ స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. సభలో శాసన మండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు వస్తూ ఉంటేనే ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలని, ఎంఈఓలు, డీఈఓలు, ఇతర ఉన్నతాధికారులు అవసరం ఉంటుందన్నారు. విద్యార్థులే లేకపోతే వీళ్లంతా అవసరం లేదని అన్నారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఈ ఉద్యోగులంతా తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పుష్కలంగా ఉంటారని చెప్పారు. విద్యార్థులు చదువును లక్ష్యంగా పెట్టుకుని చక్కగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు అన్నారు. ఇందుకు ఉదాహరణగా ఆస్ట్రేలియాకు చెందిన" నిక్" గురించి చందలూరు పాఠశాలకు చెందిన గొట్టిపాటి చంద్రిక అనే విద్యార్థిని ద్వారా సభలో చెప్పించారు. పంగులూరు మండలంలో హైస్కూళ్ళ చక్కగా పనిచేస్తున్నాయని, ఉపాధ్యాయులు ఒకరికొకరు పోటీపడి విద్యార్థులకు చక్కగా పాఠాలు చెబుతున్నారని చెప్పారు. మండలంలో ప్రైవేట్ పాఠశాలలు లేకపోవటానికి ఇక్కడున్న ఉపాధ్యాయుల సమిష్టి కృషి కారణమన్నారు. ప్రైవేట్ పాఠశాలలు చెందిన బస్సులను కూడా గ్రామాల్లోకి రానీయకుండా ఉండేందుకు విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు కషి చేయాలని కోరారు. విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్ సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని, ట్రిబుల్ ఐటీ సాధిస్తే ఆరు సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఉద్యోగంతోనే బయటకు వస్తారని ఆయన చెప్పారు. అనంతరం లక్ష్మణరావు తల్లిదండ్రుల పేరుతో ఉన్న కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ట్రిబుల్ ఐటీ, ఎన్ఎంఎంఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలు, 1,000 రూపాయల నగదు, బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాలను విద్యార్థులకు బహుకరించారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు టీ.వీ. నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే. నాగభూషణం, జి. వీరాంజనేయులు, పంగులూరు, అలవలపాడు, కొండ మంజులూరు, చందలూరు, బూధవాడ జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొప్పోలు రమాదేవి, స్వయంపు గోవిందరాజులు, ఇమ్మడిశెట్టి అనిత, చందలూరి గిరిజ, కే. బంగారుకొండ, ముప్పవరం హై స్కూలు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, నాగాలాండ్ రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు. చెంచయ్య, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చందలూరు విద్యార్థిని నాయపాము శృతి యోగాలో అనేక ఆసనాల ద్వారా సభికులను ఆకట్టుకుంది.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు


విద్యార్థులకు డిక్షనరీ అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజలకు ఉత్తమ సేవలందించండి

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా - రెడ్‌క్రాస్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్


మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ప్రజలకు సేవలను అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రకాశం జిల్లా శాఖ తమవంతు కషి చేయాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో సమావేశమై, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చేపడుతున్న సేవలు, కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. ప్రకాష్ బాబు చేపడుతున్న సేవలు, కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపట్టిన రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్, కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ రూపొందించిన బ్రోచర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ సి . వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శి, స్టేట్ సిఇఒ లోకేశ్వర రావు , కోశాధికారి రాఘవయ్య, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తం



అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా భారీవర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమయ్యారు. ప్రధానంగా బాపట్ల జిల్లాలో కష్ణా నది పరిహాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేసిన క్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట రమణ, జిల్లా ఎస్పి తుషార డూడి లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు తగిన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. వరద పరిస్థితిని ఎంత నీరు విడుదలయితే అటు ప్రజలకు గానీ, పంట పొలాలకు గానీ నష్టం జరుగుతుందనే అంశాలపై సంబంధిత అధికారుల నుండి ఆరా తీశారు. కష్ణా నదికి వరద ఉధృతి పెరిగితే తీసుకోవలసిన చర్యలపై ఆయా శాఖల అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీఈపీడీసీఎల్ అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. అల్పపీడన ప్రభావంతో జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగితే పరిష్కరించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లంక గ్రామాల ప్రజలపై ప్రత్యేక దష్టి సారించాలని మంత్రి గొట్టిపాటి చెప్పారు. విద్యుత్ స్తంభాలు, వక్షాలు నెలకొరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రారంభించాలని, ప్రజలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. కాగా వర్షాకాలంలో విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీడని వర్షాలతో ముసురు పట్టి వాతావరణంలో తేమ శాతం అధికం కావడంతో విద్యుత్ పట్ల అశ్రద్ధ వహిస్తే ప్రాణాలకే ప్రమాదమని తెలిపారు. వర్షాలతో పాటు ఈదురు గాలులకు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం గాలుల ధాటికి చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు తగులుతుంటాయి. ఆ సమయంలో వాటిని తాకితే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదముంది. వర్షాకాలంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అసలు నిలబడకూడదని, వర్షాలలో విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విద్యుత్ ప్రమాదాలకు జరగకుండా ప్రజలకు తెలియజేసే చర్యలు చేపట్టారు.

దినసరి వేతనాల కింద పనిచేస్తున్న వ్యక్తులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధిక నైపుణ్యం, నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం, నైపుణ్యం లేని వ్యక్తులకు కార్మిక చట్టం అనుసరించి దినసరి వేతనాలు పెంచారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో దినసరి వేతనాలు పొందుతున్న వ్యక్తులకు నామినల్ మాస్టర్ రూల్ పెంచారు. అధిక నైపుణ్యం ఉన్న వారికి దినసరి వేతనం రూ.863 ఉండగా దాన్ని రూ.900 పెంచారు. నైపుణ్యం ఉన్నవారికి రూ.821 నుంచి రూ.850 వరకు, అలాగే పాక్షిక నైపుణ్యం ఉన్న వారికి రూ.713 ఇస్తుండగా రూ.750కి, నైపుణ్యం లేని వారికి దినసరి వేతనం కింద రూ.594 ఇస్తుండగా దాన్ని రూ.650 వరకు పెంచారు. కార్మిక చట్టాలను అనుసరించి నూతనంగా నేతనాల పెంపుదల జరిగిందని ఉల్లంఘన జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులిచ్చారు.

బాపట్ల జిల్లాకు సంబందించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక ప్రణాళికను ఆమోదించారు. వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చి రుణ సదుపాయం కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాలకు కలిపి మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,443.60 కోట్లు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు రూ.11,719 కోట్ల రుణాలు ఇవ్వాలని, ప్రాధాన్యత లేని రంగాలకు రూ.1,724 కోట్ల రుణాలు ఇవ్వాలని, ప్రాధాన్యత రంగంలోనే తొలి ప్రాధాన్యతగా వ్యవసాయానికి రూ.10,053కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు రూ.1,153.33కోట్లు కేటాయించారు. విద్యా రుణాలు, గహ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, సామాజిక అవసరాలు, తదితరమైన ప్రాధాన్యత రంగాలకు రూ.512 కోట్లు రుణాలు ఇవ్వనున్నారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

రిటైనింగ్ వాల్ కట్టాలని..

రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

రిటైనింగ్ వాల్ కట్టి కారుమంచి కాలువను పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో సాగర్, మైనింగ్ అధికారుల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. గత మూడేళ్ల క్రితం ఒంగోలు బ్రాంచి కాలువ నుంచి వెళ్లే కారుమంచి కాలువ గట్టు మధుకాన్ గ్రానైట్ క్వారీలో జారిపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే.. మధుకాన్ గ్రానైట్ కంపెనీవారు కాలువ గట్టును నిబంధనల అతిక్రమించి క్వారీయింగ్ చేయడం వల్ల కాలువ గట్టుతో పాటు, కాలువ కూడా క్వారీలోకి జారిపోయింది. కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేర శనివారం సాగరు ఈఈ రమణారెడ్డి, మైనింగ్ డిడి జగన్నాథరావు, సాగరు డిఈలు ,రైతుసంఘం నాయకులు కారుమంచి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ మధుకాన్ వారు నిబంధనలను అతిక్రమించి త్రవ్వకాలు జరపడం, కాలువ కట్టపై గ్రానైట్ భారీ వాహనాలు నడపడం వల్ల కాలువ కట్ట బలహీనపడి కాలువ కట్టతో పాటు, కాలువ సగభాగం క్వారీలోకి జారిపోయిందన్నారు. కాలువను పూర్వస్థాయిలో పునరుద్ధరించాలంటే, క్వారీ కింది భాగం నుంచి సిమెంట్ కాంక్రీట్‌తో రిటైనింగ్ వాల్ నిర్మించడం ద్వారానే సాధ్యమౌతుందన్నారు. కాలువ కట్ట పగులగొట్టి, కాలువ నిర్మించడానికి ప్లాన్ రూపొందించి, దాన్ని అమలుపరచడానికి అధికారులు సిద్ధపడ్డారు. దీనిని రైతుసంఘం ప్రతినిధులు పూర్తిగా వ్యతిరేకించారు. ఆ విధంగా చేయడం వల్ల 25 వేల ఎకరాల ఆయకట్టుదారులకు అన్యాయం జరుగుతుందని, సాగర్ ఈఈ ఎదుట రైతు సంఘం నాయకులు తీవ్ర నిరసన తెలిపారు. కాలువ కింద ఉన్న 18 పంచాయతీల రైతులు దెబ్బతింటారని, పది చెరువుల కింద వరిసాగు ఆగిపోతుందన్నారు. రైతుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకున్న సాగరు ఈఈ రమణారెడ్డి మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ కట్టడానికి ఎస్టిమేషన్ వేసి పంపిస్తామని, రైతుసంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, మాదాల నరసింహారావు, నల్లూరి క్రిష్ణయ్య, సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, పల్లాపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.


కారుమంచి కాలువను పరిశీలిస్తున్న దృశ్యం